క్లుప్తంగా

ప్రజలకు ఇబ్బంది లేకుండా దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులైన గృహజ్యోతి లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించే క్రమాన ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా చూడాలని మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ పథకాలను అర్హులకు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అలాగే, దరఖాస్తుదారులతో మాట్లాడి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కందాళ పర్యటన

ఖమ్మం రూరల్/నేలకొండపల్లి/కూసుమంచి/తిరుమలాయపాలెం: పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. అలాగే, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అంతేకాకుండా బీఆర్ఎస్ నాయకులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే పలు అంశాలపై చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడాలని సూచించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, నాయకులు బెల్లం వేణు, గుడిబోయిన దర్గయ్య, మట్టా వెంకటేశ్వరరావు, ముత్యం కృష్ణారావు, అక్కినపల్లి వెంకన్న, వేముల వీరయ్య, గూడా సంజీవరెడ్డి, దండా రంగయ్య, బోనగిరి కిరణ్, వెన్నబోయిన శ్రీనివాసరావు, కమదన ప్రవీణ్, బాణోత్ శంకర్ పాల్గొన్నారు.

పాండురంగాపురంలో డెంగీ కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 2వ డివిజన్ పాండురంగాపురంలో డెంగీ కేసు నమోదైంది. జ్వరంతో బాధపడుతున్న 32ఏళ్ల మహిళకు ఆదివారం నిర్వహించిన పరీక్షల్లో డెంగీగా నిర్ధారించారు. ఈనేపథ్యాన మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన సోమవారం పాండురంగాపురంలో వైద్యశిబిరం నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేసినట్లు మంచుకొండ వైద్యాధికారి బాలకృష్ణ తెలిపారు. కాగా, డెంగీ బారిన పడిన మహిళ ఖమ్మంలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తోందని, ఆమె ఇంటి పరిసరాల్లో పారిశుద్ధ్య లోపాన్ని గుర్తించి నివారణ చర్లయు చేపట్టినట్లు పేర్కొన్నారు.

18న కామేపల్లి సొసైటీ చైర్మన్ ఎన్నిక

కామేపల్లి: కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ పదవికి 18న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి సందీప్‌కుమార్ తెలిపారు. అదే రోజు నామినేషన్ల స్వీకరణతో పాటు ఎన్నిక నిర్వహించి ఫలితం వెల్లడిస్తామని పేర్కొన్నారు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక జరుగుతుందని ఆయన తెలిపారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగరంలో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. అనాసాగారంలో ఓ ఇంట్లో అక్రమంగా బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దాదాపు ఐదు క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకోగా, ఎవరు నిల్వ చేశారనే అంశంపై పోలీసులు, సివిల్ సప్లై అధికారులు విచారణ చేపడుతున్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	70	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	48		20
కాకర	60	చుక్కకూర	3
బోడ కాకర	270		20
బీర	38	తోటకూర	4
దొండ	40		20
పొట్లకాయ	50	గోంగూర	4
చిక్కుడు	74		20
గోరుచిక్కుడు	50	మెంతికూర	2
క్యాబేజీ	40		20
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	42		40
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	50		30
క్యాప్సికం	70	-ఖమ్మం వ్యవసాయం	

అరవొద్దు.. కరవొద్దు..

- నగరంలో కుక్కల నియంత్రణకు చర్యలు
- ఏబీసీలో 15 రోజులుగా నిలిచిన ఆపరేషన్లు
- నానాటికీ శునకాల సంతతి పెరుగుతుండడంతో ప్రజలకు ఇక్కట్లు
- కమిషనర్ చొరవతో స్టెరిలైజేషన్ నిర్వహణపై దృష్టి



శస్త్రచికిత్స చేసేందుకు కుక్కలను బంధిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఏ వీధి చూసినా.. ఎక్కడ రహదారిపై వెళ్తున్నా వీధి కుక్కలు ప్రజలు, వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఓ పక్క శునకాల నియంత్రణ కోసం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అన్ని చర్యలు చేపడుతున్నామని చెబుతున్నా గుంపులుగా కుక్కలు సంచరిస్తుండడం గమనార్హం. వీటి కారణంగా రాత్రి మాటేమో కానీ ఉదయం వేళ కూడా పాదచారులు, వాహనదారులు భయపడుతున్నారు. రాత్రి వేళ అయితే వాహనాల వెంట పడటం, పాదచారులపై దాడి చేయడం సర్వసాధారణంగా మారింది. కుక్కల నియంత్రణకు ఖమ్మంలో ప్రత్యేకంగా యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ) ఏర్పాటుచేసి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నా వాటి సంతతి తగ్గడం లేదు. అయితే, ఈ సెంటర్‌లో గత పదిహేను రోజులుగా శస్త్రచికిత్సలు నిలిచిపోవడంతో ఇటీవల పరిశీలించిన కమిషనర్ వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.

బిల్లులు రాకపోవడంతో...

ఖమ్మం ఏబీసీలో వీధి కుక్కలకు నిర్వహించే శస్త్రచికిత్సలు నిలిచిపోయినట్లు తెలిసింది. గత 15 రోజులుగా కుక్కలకు స్టెరిలైజేషన్ చేయడం లేదని సమాచారం. ఇందుకు సంబంధించి బిల్లులు రాకపోవడమే కారణంగా తెలిసింది. అయితే, గణాంకాల్లో భారీగా ఉంటున్నా వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ సక్రమంగా నిర్వహించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అందుకే నగరంలో కుక్కల సంతతి తగ్గకపోగా.. నానాటికీ పెరుగుతోందని నగర వాసులు ఆరోపిస్తున్నారు.

కమిషనర్ చొరవ

ఏబీసీ సెంటర్‌ను ఇటీవల సందర్శించిన సమయంలో కుక్కల శస్త్రచికిత్సలు నిలిచిపోయిన విషయం తెలుసుకున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య సంబంధిత అధికారులు, వైద్యులతో మాట్లాడారు. నగరంలో కుక్కలకు శస్త్ర చికిత్సలు ఎలా చేస్తున్నారు.. డివిజన్లలో కుక్కలను ఎలా పట్టుకుంటున్నారనే అంశాలపై ఆరా తీశాక పలు సూచనలు చేశారు. త్వరగా పునరుద్ధరించాలని ఆదేశించడంతో మళ్లీ అధికారులు దృష్టి సారించారు. ఈసారైనా కుక్కలకు కట్టుదిట్టంగా స్టెరిలైజేషన్ చేపట్టి సంతతి పెరగకుండా అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరు వేలకు పైగా కుక్కలకు స్టెరిలైజేషన్

గత మూడేళ్లగా కేఎంసీ పరిధిలో కుక్కల సంఖ్య భారీగా పెరగడం, పిల్లలు, పెద్దలపై దాడులకు దిగుతుండటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పలు సందర్భాల్లో ప్రజాప్రతినిధులు, నగర వాసులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులు, పాలకవర్గాన్ని డిమాండ్ చేశారు. దీంతో 2021 మార్చిలో ఖమ్మంలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ కుక్కలకు ప్రత్యేకంగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స(స్టెరిలైజేషన్) చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆడ, మగ కలిపి మొత్తం సుమారు ఆరు వేలకు పైగా కుక్కలకు స్టెరిలైజేషన్ చేసినట్లు అధికారులు చెబుతుండగా.. ఇందుకోసం రూ.కోటికి పైగా ఖర్చు చేశారు.

ఈ బురద దాటితేనే బడికి...



బురద తప్పించుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

రఘునాథపాలెంలోని బొడ్రాయి వద్ద ఆంజనేయస్వామిగుడి ఎదురు రోడ్డును సీసీగా మార్చకపోవడంతో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు బురదమయమవుతోంది. పంచాయతీలో చాలా వరకు సీసీ రోడ్లు వేసినా ఈ రోడ్డును మాత్రం పట్టించుకోలేదు. దీంతో గుంతలు పడి.. అందులో వర్షం నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈక్రమంలో పాఠశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు ఓ పక్క సంచి మోస్తూ మరోపక్క బురద దాటి వెళ్లడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా రోడ్డును సీసీగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు. – రఘునాథపాలెం

రోడ్డుపైనే వర్షపు నీరు..



మామిళ్లగూడెంలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

నగరంలోని 49వ డివిజన్ మామిళ్లగూడెంలో డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడం, రోడ్డు లోతట్టుగా ఉండడంతో చిన్నపాటి వర్షానికే నీరు రోడ్డుపై నిలుస్తోంది. నీరు డ్రెయినేజీలోకి వెళ్లే మార్గం లేక ఈ పరిస్థితి ఎదురవుతోందని, కాస్త పెద్ద వర్షం కురిస్తే గ్రామీణ బ్యాంక్ వద్ద మోకాలి లోతు నీరు నిలుస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – ఖమ్మంమయూరిసెంటర్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ రాజిరెడ్డి

ఖమ్మంరూరల్: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, తద్వారా మంచి భవిష్యత్ సొంతమవుతుందని ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి తెలిపారు. మండలంలోని ఎం.వెంకటాయపాలెంలో సోమవారం మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై ఏర్పాటుచేసిన చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలను త్యజించి చక్కగా చదువుకోవాలని యువతకు సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారితే సమాజానికి దూరం కావాల్సి వస్తుందని తెలిపారు. కాగా, గంజాయి, ఇతర మత్తు పదార్థాల అమ్ముతున్న వారి వివరాలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ పి.రామారావు, సిబ్బంది, గ్రామపెద్దలు తాళ్లూరి వెంకటయ్య, నిదిగొండ వెంకటేశ్వర్లు, ఎన్.ఉపేందర్, రామయ్య, ఆర్.సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూములకు పట్టాలు ఇప్పించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

కూసుమంచి: వ్యవసాయ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించాలని గైగోళ్లపల్లి రెవెన్యూ పరిధిలోని రైతులు కోరారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులతో కలిసి సోమవారం వారు తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తమ అనుభవంలో ఉన్న భూములకు అదే సర్వే నంబర్లలో ఉన్న ఇతర రైతులకు పట్టాలు అయిన విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించామన్నారు. ఇప్పటికే ఏళ్లగా రైతుబంధు కోల్పోతున్న నేపథ్యాన ఇకనైనా న్యాయం చేయాలని కోరారు. సీపీఐ నాయకులు భూక్యా నర్సింహ, జల్లా లింగయ్య, నాగరాజు, సైదులు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రమణగుట్టలో ఆగని తవ్వకాలు



హనుమాన్‌నగర్‌లో గుట్టను తవ్వుతున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని రమణగుట్ట ప్రాంతంలో గుట్టల తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో కబ్జాదారులు యథేచ్ఛగా గుట్టలను తవ్వి భూమి ఆక్రమణకు యత్నిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. దివ్యాంగుల కాలనీ సమీపాన హనుమాన్‌నగర్‌లో గుట్టను పొక్లెయిన్‌తో తవ్వుతుండగా స్థానికులు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు చేరుకుని తవ్వకాన్ని అడ్డుకున్నట్లు తెలిసింది. అయితే, అధికారుల రాకను గుర్తించి ప్రొక్లెయిన్ డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పరారయ్యాడని స్థానికులు తెలిపారు. ప్రభుత్వ భూములను రక్షించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా, అధికారుల నిర్లక్ష్యంతో నగరంలో భూములు, గుట్టలు మాయమవుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

కేఎంసీ గ్రీవెన్స్‌కు 27 ఫిర్యాదులు



ఫిర్యాదును పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 27 ఫిర్యాదులు అందాయి. ఈసందర్భంగా కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారంపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. టౌన్‌ప్లానింగ్ విభాగం, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులపై తానే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఏ.సంపత్‌కుమార్, ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహించొద్దు

పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సిబ్బందిని హెచ్చరించారు. కేఎంసీలోనిలో సోమవారం ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. డివిజన్లలో జవాన్లు పనితీరును నమోదు చేసి, సక్రమంగా పని చేయని వారివివరాలు తనకు సమర్పించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. ఖాళీ స్థలాలు, రోడ్ల వెంట పిచ్చి మొక్కలు తొలగించాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, కార్మికులు తక్కువగా ఉన్న డివిజన్లలో ప్రైవేట్ కార్మికులను నియమించాలని తెలిపారు.

తప్పుడు మినహాయింపులతో రీఫండ్



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ఖమ్మంగాంధీచౌక్: తప్పుడు విధానాల్లో రీఫండ్స్ తీసుకుంటున్న అంశంపై ఆదాయ పన్ను శాఖ ఆధ్వర్యాన సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఖమ్మంలోని శాఖ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో ఆదాయ పన్ను శాఖ అధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ చాప్టర్ 6ఏ కింద తప్పుడు మినహాయింపులు, తగ్గింపులు దాఖలు చేసి కొందరు ఉద్యోగులు రీఫండ్ స్వీకరిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వారికి నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. ఆపై అప్‌డేట్ అయిన రిటర్న్స్ ఫైల్ చేయాలని, లేనిపక్షంలో పన్నుపై 200 శాతం మేర జరిమానా విధించే అవకాశముందని చెప్పారు. ఈ సమావేశంలో ఆదాయ పన్ను శాఖ ఇన్‌స్పెక్టర్ మహేంద్ర చైతన్య, సీనియర్ ఆడిటర్లు మురళీకృష్ణ, ప్రసాద్, కేఎస్ఆర్‌కే.ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ'లను సద్వినియోగం చేసుకోవాలి



కోరట్లగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు

నేలకొండపల్లి/ఖమ్మం అర్బన్: పిల్లలకు పూర్వప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. నేలకొండపల్లి మండలం చెరువుమాధారంలో 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని సోమవారం తిరుమలాయపాలెం ఐసీడీఎస్ ఏసీడీపీఓ కనకదుర్గ ప్రారంభించి మాట్లాడారు. అలాగే, రాజేశ్వరపురం సెక్టార్‌లోని మండ్రాజుపల్లిలో సూపర్‌వైజర్ నాగమణి, కోరట్లగూడెంలో అంగన్‌వాడీ టీచర్ బచ్చలకూరి నిర్మల ఆధ్వర్యాన కార్యక్రమం నిర్వహించారు. ఇక ఖమ్మం నగరంలోని గొల్లగూడెం, కొత్తగూడెం, రాజన్నపేట, మధురానగర్ అంగన్‌వాడీల కేంద్రాల్లోనూ ర్యాలీలు నిర్వహించారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

కూసుమంచి: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడడంతో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్రాంతి, మస్తాన్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంతో పాటు కూసుమంచిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలని, నేలకొండపల్లి కళాశాలకు ప్రహరీ, పిండిప్రోలులోని కళాశాలకు నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. నాయకులు, గాంధీ రవికిరణ్, గోపి, రామకృష్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్తసేకరణ, ఫాగింగ్ చేపట్టాలి

ఖమ్మంఅర్బన్: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ప్రతిరోజు డివిజన్లలో ఇంటింటి చెత్త సేకరించడమే కాక దోమలనివారణకు వీధుల్లో ఫాగింగ్ చేయాలని మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. ఖమ్మం 4వ డివిజన్ పాండురంగాపురంలో సోమవారం పర్యటించిన వారు పారిశుద్ధ్య నిర్వహణ, తదితర అంశాలపై ఆరాతీశారు. డెంగీ వ్యాప్తికి కారణమైన దోమల నిర్మూలనకు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని స్థానికులకు సూచించారు. ఆతర్వాత ఇటీవల డెంగీ బారిన పడి కోలుకున్న వారిని పరామర్శించారు. కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, డాక్టర్ బాలకృష్ణ, సీనియర్ ఎంటమాలజిస్ట్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు భూమిలో సర్వే

ఖమ్మంఅర్బన్: నగరంలోని వెలుగుమట్ల పెద్ద (గొల్లగూడెం) చెరువు భూములను జలవనరుల శాఖ, రెవెన్యూ అధికారులు సోమవారం సర్వే చేశారు. మూడు నెలల క్రితం చెరువు శిఖంలో మట్టి తవ్వకాలు చేపడుతున్నారనే సమాచారంతో జలవనరుల శాఖ ఉద్యోగులు పరిశీలించి బోర్డులు పాతించారు. కానీ కొందరు భూమి తమదేనంటూ సర్వే చేయించాలని కోరారు. దీంతో రెండు శాఖల ఆధ్వర్యాన సర్వే చేపట్టారు. జలవనరుల శాఖ డీఈ ఉదయ్‌ప్రతాప్, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, సర్వే ఏడీ లూర్దు తదితరులు పాల్గొన్నారు.

'న్యూ ఇరా'లో బోనాల పండుగ



విద్యార్థులతో చైర్మన్, డైరెక్టర్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని న్యూ ఇరా పాఠశాలలో సోమవారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఐ.వీ.రమణారావు, డైరెక్టర్ భూమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేంలా పండుగ నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు వివిధ వేషధారణాల్లో బోనాలు ఎత్తుకోవడం ఆకట్టుకుంది.

'సర్వజ్ఞ'లో పోలింగ్



పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులతో డైరెక్టర్లు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని సర్వజ్ఞ పాఠశాలలో సోమవారం పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు ఆర్‌వీ.నాగేంద్రకుమార్, నీలిమ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో నాయకుడు, ఉప నాయకుడు, తరగతుల వారీగా నాయకులను ఎన్నుకునేందుకు పోలింగ్ నిర్వహించామని తెలిపారు. సాధారణ ఎన్నికలపై అవగాహన కల్పించడమే కాక నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా నామినేషన్ల దాఖలు, గుర్తులు కేటాయింపు, ప్రచారం, ఓటింగ్ తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు.

సాయినాథుడికి అభిషేకం

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా ఖమ్మం గాంధీచౌక్‌లోని వరప్రదాత షిర్డీ సాయి మందిరంలో సోమవారం విభూది(భస్మం)తో అభిషేకం చేశారు. అనంతరం అఘోర పాశుపత మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మందిరం అధ్యక్ష, కార్యదర్శులు వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్‌తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంరం నెల్లూరుకు చెందిన కర్లపూడి కృష్ణ బాబా ప్రవచనాలే వినిపించారు. అలాగే, హర్కారాబావి రోడ్డులో రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణ సాయి ఆశ్రమంలో బాబాకు పంచదారతో అభిషేకం చేశారు. ఆశ్రమ చైర్మన్ లగడపాటి రామారావు, కార్యదర్శి సిద్దంశెట్టి నాగమణి పాల్గొన్నారు.

ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శికి సన్మానం

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయులకు సర్వీస్, అకడమిక్ విషయాల్లో సేవలు అందిస్తున్న ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ వరప్రసాద్‌ను సోమవారం హైదరాబాద్‌లో సన్మానించారు. ఈసందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, సాయి శ్రీనివాస్ ఆయనను సన్మానించి వరప్రసాద్ సేవలను కొనియాడారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ నాయకులు పలువురు పాల్గొన్నారు.

అన్వేష్‌రెడ్డిని కలిసిన నాయకులు



అన్వేష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న జిల్లా నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా సుంకేట అన్వేష్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్, నాయకులు కొంటిముక్కల నాగేశ్వరరావు, చీమలధర్ గోపి, బాదావత్ నరేష్, చింతనిప్పు మాధవరావు, శీలం బ్రహ్మారెడ్డి, వల్లూరి భద్రారెడ్డి, కొప్పుల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మల్లెమడుగు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సత్తా చాటారని హెచ్‌ఎం జి.కృష్ణవేణి తెలిపారు. విద్యార్థులు వి.లతిక, కె.అనిత, ఎం.రేణుక ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జరిగిన రాష్ట్ర స్థాయి బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు తరఫున పాల్గొన్నారని వెల్లడించారు. ఈ జట్టు మూడో స్థానంలో నిలవగా కాంస్య పతకం అందుకున్నారని తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీ బి.కృష్ణయ్య, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆదర్శ్, కార్పొరేటర్లు నిరంజన్, లలితారాణి, గ్రామస్తులు కృష్ణ, సూర్యం, కృష్ణమూర్తి, సతీష్, ఉపాధ్యాయులు అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నేలకొండపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యాన ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మిషన్ భగీరథ డీఈఈ ఓంప్రకాష్ సూచించారు. మండలం లోని కోనాయిగూడెంలో భగీరథ పైపులైన్ పనులను సోమవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 45 కనెక్షన్లు ఇవ్వాలని సిబ్బందికి సూచించాక మాట్లాడారు. లీకేజీలను ఎప్పటికప్పుడు అరికట్టడంతో పాటు గ్రామంలో ట్యాంక్‌ల వద్ద శుభ్రం చేయించాని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బోళ్ల వీరబాబు, భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

20లోగా పాఠశాలల్లో పనులు పూర్తిచేయాలి

నేలకొండపల్లి: మండలంలో ఎంపిక చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను ఈనెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన హెచ్‌ఎంలు, గ్రామ సమాఖ్య అధ్యక్షులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పాఠశాలల్లో పనులు సకాలంలో పూర్తయ్యేలా హెచ్‌ఎంల, కమిటీ చైర్మన్లు సమన్వయంతో ముందుకు సాగాలని చెప్పారు. అలాగే, ప్రతీ పాఠశాలలో మొక్కలు నాటాలని సూచించారు. ఎంపీఓ శివ, ఐకేపీ ఏపీఎం ఆశోక్‌రాణి, ఆర్అండ్‌బీ ఏఈలు దేవేందర్, కోటేశ్వరరావు, ఎంపీఓ చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151 | మధిర వీరబాబు - 98498 64638
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 | టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957